General News

# ప్రణాళికతోనే ఉత్తమ ఫలితాలు

## కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** ఉత్తమ ఫలితాల సాధనకు పక్కా ప్రణాళిక అవసరమని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో విద్యా శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఫలితాల సాధనపై ప్రధానోపాధ్యాయులు, మండల నోడల్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో అమలు చేస్తున్న కార్యక్రమాలపై విద్యాశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి కాంప్లెక్స్ ప్రాధానో పాధ్యాయులు తమ పరిధిలోని పాఠశాలలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పాఠశాల పరిశీలనలో వివిధ అంశాలను గమనించాలని వాటిపై నిర్ణయాలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల నమోదు మధ్యాహ్న భోజన పథక అమలు తీరు, మొదటి నిర్మాణాత్మక మూల్యాంకనం ఫలితాల మీద వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిశీలన సమయంలో తరగతి గదిలో ఉపాధ్యాయుని బోధన తీరును విద్యార్థుల భాగస్వామ్యం గురించి బోధన అభ్యసన ప్రక్రియలో బోధన ఉపకరణాల ఉపయోగం గురించి ఉపాధ్యాయుల విద్యార్థుల హాజరు గురించి తప్పక పరిశీలించి పలు సూచనలు చేయాలని మండలం అధికారులకు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ సూచించారు. పీఎం శ్రీ పథకం కింద



ఎంపికైన పాఠశాలల్లో పనుల పురోగతి గురించి ఆయా కళాశాల ప్రిన్సిపాల్ ను ఇంజనీరింగ్ విభాగం వారిని అడిగి తెలుసుకున్నారు. నవంబర్లో నిర్వహించే (నేషనల్ అచీవ్మెంట్ సర్వే) జాతీయ సాధన సర్వే లో జిల్లా మంచి ఫలితాలను సాధించాలని, ఇందుకోసం పాఠశాల స్థాయి ప్రణాళికను రచించుకొని విద్యార్థులను సన్నద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి రాము, జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, జిల్లా సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



# కాలేశ్వరంపై అసత్య ఆరోపణలు

- తెలంగాణ జలాలను ఆంధ్రా పాలకులు ఎత్తుకుపోతున్నరు
- సీఎం రేవంత్‌రెడ్డి ఏం చేస్తుండు?
- మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య



**జనగామ, మన చౌరాస్తా :** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో రూ. లక్ష కోట్లు తిన్నారని ఆరోపణలు చేయడం తప్ప.. కాంగ్రెస్ నేతల వద్ద ఎలాంటి ఆధారాలు లేవని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య అన్నారు. జనగామ జిల్లా ఉద్యమ కేసు విషయంలో మంగళవారం జనగామ కోర్టుకు వచ్చిన పొన్నాల అనంతరం స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. వారు ఎన్నిక జిమ్మిక్కులు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రైతులు వానాకాలంలో సాగు చేసిన పంటకు నీరందక ఎండిపోతుంటే ప్రభుత్వం కళ్లప్పగించి చూస్తోందని మండిపడ్డారు. తెలంగాణ జలాలను అక్రమంగా ఆంధ్రా పాలకులు ఎత్తుకుపోతుంటే మన సీఎం రేవంత్‌రెడ్డి ఏం చేస్తున్నాడని ప్రశ్నించారు. మేడిగడ్డలో మూడు పిల్లర్లు కుంగిపోతే హంగామా చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రజలకు మేలు చేసే పనుల గురించి ఆలోచించాలని హితవుపలికారు. సమావేశంలో కౌన్సిలర్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, సీనియర్ నాయకులు ధర్మపురి శ్రీనివాస్, ఉల్లెంగుల సందీప్ తదితరులు ఉన్నారు.

### మాజీ మంత్రికి సన్మానం..

మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య మంగళవారం ఉదయం జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి జనగామ నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనను సాదరంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించారు.



# పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

(మొదటి పేజీ తరువాయి)

అభ్యసించాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని కలెక్టర్ వారిని అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. చుట్టూ పరిసరాలన్నీ ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాఠశాలలో మౌలిక వసతులపై దృష్టి సారించాలన్నారు. అనంతరం విద్యార్థుల వసతి గృహాలను, కళాశాల, పాఠశాలకు సంబంధించిన వంటశాలలను నిశితంగా పరిశీలించి, నాణ్యత ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా, లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించి వారిని ఇంప్రూవ్ చేయాలని ప్రిన్సిపాల్ కు సూచించారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి బి.రవీందర్, కళాశాల ప్రిన్సిపాల్ పి.అనిల్ బాబు, పాఠశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.




# లయన్స్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ

**జనగామ, మన చౌరాస్తా :** లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ మిలీనియం ఆధ్వర్యంలో క్లబ్ సభ్యుడు లయన్ ఏలే రాము పుట్టిన రోజు సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు గాదె నరసింహులు ఆధ్వర్యంలో స్థానిక జిల్లా ఆసుపత్రిలో అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రీజియన్ చైర్మెన్ లయన్ చందుపట్ల రవీందర్ రెడ్డి పాల్గొని మాట్లాడుచూ అన్నదానం చాలా గొప్పదన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి విర్రి వేణుగోపాల్ రెడ్డి, కోశాధికారి బండ బిక్షపతి, జోన్ చైర్మన్ రంగరాజు ప్రవీణ్ కుమార్, పూర్వ రీజియన్ చైర్మన్ శ్రీరామ్ శ్రీనివాస్, పూర్వ అధ్యక్షుడు బైరి వెంకటేష్, దాసరి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# పీడీఎస్ బియ్యం పట్టివేత

చేర్యాల, మన చౌరాస్తా : అక్రమంగా నిల్వ ఉంచిన 16.50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కొమురవెల్లి ఎస్సై రాజుగౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు, టాస్క్ ఫోర్స్ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ కొమురవెల్లి కి చెందిన కడమంచి మల్లేశం, కడమంచి తిరుపతి లు కలిసి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొని తూప్రాన్ కు చెందిన సందీప్ అనే వ్యక్తికి అమ్ముతామని వారు తెలిపారని అన్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ఇలాంటి చట్ట వ్యతిరేఖ పనులు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.